

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



4

ఎన్నేళ్లకెన్నేళ్లకు ..
40 ఏళ్ల తర్వాత నిండుకుండలా మారిన సముద్రం చెరువు
పరవశంలో రైతులు
పూజలు చేసిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

# బొప్పాయే..

**కేశంపేట, అక్టోబరు 30 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కురుస్తున్న ఆకల వర్షాలకు అన్నదాతలు, రైతులు అధిక మొత్తంలో నష్టపోయారు. కోలుకోలేని దెబ్బ పడిందని నష్టపోయిన రైతులకు సహాయాన్ని అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడోకుంటున్నారు. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన పంది రామిరెడ్డికి చెందిన నాలుగు ఎకరాల బొప్పాయి తోట పూర్తిగా నేలమట్టమై అపార నష్టం వాటిల్లింది. పంట చేతికి వచ్చే సమయానికి



మొంథా తుఫాను తాకిడికి ధ్వంసమైన బొప్పాయి తోటలు

పెద్ద మొత్తంలో నష్టం జరిగిందన్నారు. పంట చేతికొస్తే దాదాపుగా 12 నుండి 15 లక్షలు వచ్చేదని నష్టపోయిన పంటను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రామ్ రెడ్డి ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

**అకాల వర్షంతో ఆగమైన పంటలు**

అకాల వర్షానికి ఆగమై పూర్తిగా దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి శిరీష పరిశీలించారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని అల్వాల గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను రైతులతో కలిసి ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దు అని పంట నష్టాన్ని పూర్తిగా ఉన్నత అధికారులకు తెలియపరుస్తామని తుపాను కారణంగా సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరంగా అన్ని విధాల ఆదుకుంటామని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు.

భారీ వర్షాలకు నేలమట్టమైన బొప్పాయి తోటలు
వివిధ మండలాల్లో నష్టం వివరాల సేకరణ షురూ
క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ సిబ్బంది
దెబ్బతిన్న పైర్లను పరిశీలనలో రాజకీయ నేతలు
ఆదుకుంటామని అధికారపార్టీ శ్రేణులు ఓదార్పు

**మొగిలిగిద్దలో పంట నష్టం అంచనా**

**షాద్‌నగర్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వ్యవసాయ శాఖా అధికారులు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో పర్యటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా స్థానిక అధికారులతో కలిసి వరి పంటను పరిశీలించడం జరిగింది. అదే విధంగా రైతులతో మాట్లాడుతూ రైతులు అధైర్య పడకూడదనీ 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితే వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తారని, నష్టపోయిన అన్ని గ్రామాల్లో అన్ని పంటలను పరిశీలించి నివేదికలను పంపించాలని అధికారులకు ఆదేశించడం జరిగిందని అధికారి స్పష్టం చేశారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉషా

మిగతా 3లో



మేడ్చల్ డిసిసి పీఠంపై నాయకుల్లో ఉత్కంఠ
ఏఐసిసి నిబంధనలతో కొత్త ప్రక్రియ
నేతల మధ్య రహస్య పోరు
ఈసారి బిసి కార్డు కీలకం
గ్రామస్థాయి నుంచి అభిప్రాయ సేకరణ పూర్తి
హస్తినకు చేరిన నివేదికలు

## అందరి చూపు ఢిల్లీ వైపు

**మేడ్చల్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి నియామకంపై కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సారి ఈ పదవిని ఏఐసీసీ కొత్త విధానంలో భర్తీ చేయాలని నిర్ణయించడం వల్ల రేసు మరింత ఆసక్తికరంగా మారింది. పార్టీ అధిష్ఠానం ప్రకటించిన షరతులు ప్రకారం, జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావాలంటే కనీసం ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి ఉండాలి, ఒకేసారి ఒకే పదవిలో మాత్రమే ఉండాలి, పార్టీకి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలి. పార్ట్‌టైమ్ రాజకీయాలు చేసే వారు, ఎన్నికల ముందు, తర్వాత పార్టీ మార్చిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఈ నియమావళి కారణంగా పలువురు నేతలు ఆటో మేటిక్‌గా రేసు నుండి తప్పుకోగా, కొందరు మాత్రం అన్ని అర్హతలున్నాయని నమ్మకంగా పోటీలో నిలిచారు. ఎఐసీసీ నియమించిన పరిశీలకులు ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. ఈ నివేదికలను గోప్యంగా ఉంచి, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయాలను కూడా సేకరించారు. ఇప్పుడు ఆ తుది లిస్ట్ ఢిల్లీలోని పార్టీ పెద్దల వద్ద ఉంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. డీసీసీ చైర్మన్ పదవికి ఈసారి పోటీ మరింత ఉత్కంఠభరితంగా సాగుతోంది. ప్రతి నేత తనకు అనుకూలంగా కార్యకర్తలను కదిలిస్తూ, పార్టీలో చురుకైన చర్చలు జరుగుతున్నాయి.

**రేసులో నలుగురు ప్రముఖులు....**

ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకుడు నక్కా ప్రభాకర్ గౌడ్ ఈ నలుగురు నేతల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరంతా అధికారికంగా దరఖాస్తులు కూడా సమర్పించారు. హరివర్ధన్ రెడ్డి గత రెండు సంవత్స రాలుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతూ కార్య కర్తలలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, సీనియర్ నాయకత్వం నుంచి కూడా మద్దతు పొందుతున్నారు. వజ్రేష్ యాదవ్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పార్టీకి సేవలందిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా ఆయనకు స్థానికంగా బలమైన కేడర్ ఉంది. కాంగ్రెస్ వర్గాలు ఆయన్ని గెలిచిన ఎమ్మెల్యేలా పనిచేసే నాయకుడుగా భావిస్తున్నాయి. శ్రీశైలం







గౌడ్ గతంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయనకు రాజకీయ అనుభవం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు బీజేపీలో ఉండి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన విషయం కొంతమంది నేతలలో సందేహాన్ని కలిగిస్తోంది. అయితే ఆయనకు బీసీ వర్గం బలమైన మద్దతు ఉండడం అతని ప్రధాన బలం అని అనుచరులు అంటున్నారు. సీనియర్ నాయకుడు నక్కా ప్రభాకర్ గౌడ్ కూడా బీసీ వర్గానికి చెందిన వ్యక్తి. ఆయన గతంలో రెండు పర్యాయాలు మేడ్చల్ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. ఆయన గతంలో ఏ పార్టీలో ఉన్నప్పటికిని స్వంత కేడర్ ఉండటంతో పాటు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి వంటి కీలక నేతల మద్దతు కూడా లభిస్తోందని సమాచారం. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు కుడి భుజంగా భావించే నక్క ప్రభాకర్ గౌడ్‌కు ఎలాగైనా జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టడానికి నిలబడ్డారని ఆయన వర్గ నాయకులు చెబుతున్నారు

**బిసి కార్డు కీలకం......**

పాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను మూడు జిల్లాలుగా విభజించడంతో ఇప్పుడు రంగారెడ్డి జిల్లాకు ఓసీ అభ్యర్థి, వికారాబాద్ జిల్లాకు ఎస్సీ అభ్యర్థి, మేడ్చల్ జిల్లాకు బిసి వర్గానికి చెందిన అభ్యర్థి ఇవ్వాలని పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు విశ్వ సనీ య వర్గాలు తెలిపాయి. దీంతో ఈసారి బిసి వర్గానికి చెందిన నాయకుల మధ్య పోటీ మరింత హోరాహోరీగా మారింది.

**స్థానిక నేతల డిమాండ్...**

ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. స్థానిక సంస్థల్లో కూడా పార్టీ స్థాయి తక్కువగా ఉండటంతో, స్థానిక కార్యకర్తలు, పార్టీ బలపడాలంటే బీసీ వర్గానికి చెందిన నాయకుడిని అధ్యక్షుడిగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్న కాం గ్రెస్ ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఈ సారి డిసిసి చైర్మన్ స్థానాన్ని బీసీ నాయకుడికి ఇవ్వాలనే అభిప్రాయం బల పడు తోంది.

**నిబంధనలతో గందరగోళం**

పార్టీ విధించిన ఐదు సంవత్సరాల నిబంధనపై

మిగతా 3లో



మీడియాతో మాట్లాడుతున్న పొన్నం, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్

## జూబ్లీకి బిఆర్ఎస్ ఏమీ చెయ్యలేదు

ఎన్నికల ప్రచారంలో మంత్రులు పొన్నం, ఉత్తమ్ కుమార్ రెడ్డి

**షాద్‌నగర్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఏఐసిసి సభ్యులు సంపత్ కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీ తదితరులు గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హోటళ్ల వద్దకు వెళ్లి స్వయంగా పూరీలు చేసి అలరించారు. సామాన్యులతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం మంత్రులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. ఇక్కడి ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి అన్ని విధాలా మోసపోయారని వారు పేర్కొన్నారు. ఉచిత బస్సుతోపాటు ప్రజలకు ఉచిత కరెంటు, రూ. 500 కే సిలిండర్, ఉచిత సన్న బియ్యం వంటివి ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ విజయం సాధించడం ఖాయమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి ఓటును అర్థించారు.

## పర్యాటకం ముసుగు లే అవుట్ లొసుగు

**వికారాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** వికారాబాద్ అంటేనే టక్కున గుర్తుకు వచ్చేది అనంతగిరి. అనంతగిరి ప్రకృతీ సౌందర్యం అంతలా ఉంటుంది మరీ. పర్యాటకుల మనసు దోచే ఈ టూరిస్టు స్పాట్ ముసుగులో రియల్ వ్యాపారులు కొత్త దందాకు తెరతీశారు. అనంతగిరి పేరు వచ్చేలా అనంత రిసార్టు, హరిత రిట్రీట్ పేరుతో లే అవుట్ ఏర్పాటు చేశారు. కర పత్రాలలో తప్పుడు రాతలు ముద్రించి..అర చేతిలో స్వర్గం చూపిస్తూ స్థానిక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది చాలక..పక్కనే ఓ రిసార్టును అక్రమంగా నిర్మించి పర్యాటకం అందాల ముసుగులో ప్లాట్లు విక్రయించేందుకు పన్నాగం పన్నుతున్నారు. ఇది నిజమని నమ్మిన ప్రజలు రియల్ వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామ రెవెన్యూ పరిధిలో గత కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి చెందిన రియల్ వ్యాపారులు దాదాపు 150 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి జిల్లా కేంద్రానికి చుట్టూర ఉన్న గ్రామాల పరిధిలో అధికంగా వెంచర్లు వెలిసాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సదరు రియల్ వ్యాపారులు సైతం వెంచర్ ఏర్పాటు చేస్తే లాభాలు గడించవచ్చని అనుకున్నారు. దానికి తోడు అనంతగిరి కొండలు సైతం దరిదాపులో ఉండటంతో ప్లాట్లు సులభంగా విక్రయించవచ్చని భావించారు. దీనిలో భాగంగా మూడు విడతలుగా 39 ఎకరాలకు డీటీసీపీ అనుమతులు పొంది లే అవుట్ చేశారు. ఈ లే అవుట్‌కి హరిత రిట్రీట్ పేరు నామకరణం చేశారు. ఇంత పెట్టుబడి పెట్టిన వారి ఆశలు అడియాశలు అయ్యాయి. ప్రస్తుత పరిస్థితిలో రియల్ వ్యాపారం ఢమాల్ కావడంతో ఏమి చేయాలో తోచక..లే అవుట్‌కి అనుకుని ఉన్న దాదాపు 5 ఎకరాల్లో భూమిలో అనంత రిసార్టు పేరుతో అక్రమంగా రిసార్టును ఏర్పాటు చేశారు. 2 ఎకరాల్లో 6 లగ్జరీ కాటేజీలు, డైనింగల్ హాల్స్, స్విమ్మింగ్ ఫూల్, ఇతర నిర్మాణాలు చేపట్టగా, మిగతా 3 ఎకరాల్లో గార్డెనింగ్, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కృత్రిమ ప్రకృతి అందాలను నిర్మించారు. ఈ కాటేజీల బుకింగ్ పూర్తి

మిగతా 3లో

పర్యాటకులకు కృత్రిమ ప్రకృతి అందాల ఎర
ఐదు ఎకరాల్లో అనంత రిసార్టు పేరుతో నిర్మాణాలు
రెండు ఎకరాల్లో లగ్జరీ కాటేజీలు, డైనింగ్ హాల్స్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాట్లు
మూడు ఎకరాల్లో గార్డెనింగ్, కృత్రిమ అందాల కల్పన
ఖాళీ స్థలంలోనూ గుడారాలు వేసి పర్యాటకులకు వల
హరిత రిట్రీట్ లే అవుట్ బ్రోచర్‌లో 150 ఎకరాలకు అనుమతులున్నట్లు ప్రచారం
39 ఎకరాలకే డిటిసిపి అనుమతులు
అసైన్డ్ పట్టా భూమి అవడం వలనే డిటిసిపి అనుమతుల నిరాకరణ
పర్యాటకులను తప్పుదారి పట్టించి ప్లాట్లు అంటకట్టేందుకు యత్నాలు
రిసార్టులో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపార సముదాయాల నిర్మాణం
అధికారుల అండదండలతో 'అనంత' రిసార్టు కొనసాగింపు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన హరిత రిట్రీట్ ప్లాట్లు



అనంత రిసార్టులో అనుమతి లేకుండా నిర్మించిన కాటేజీలు





150 ఎకరాలకు టిడిసిపి అనుమతులు ఉన్నట్లు ముద్రించిన హరిత రిట్రీట్ బ్రోచర్

రిసార్టులోని స్విమ్మింగ్ ఫూల్

## పార్టీలు పక్కన పెట్టి పటేల్‌కు జై కొట్టండి

జయంతి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణలో ఎంపి ఈటల పిలుపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఉక్కు మనిషి సర్దార్‌వల్లబ్‌బాయి పటేల్ 150వ జయంతి ఉత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో సన్నాహాలు చేస్తున్నట్లు, త్యాగం, పట్టుదల, కార్యదీక్ష, ఐక్యతకు, స్వేచ్ఛకు ప్రతీక ఉక్కు మనిషి సర్దార్ వల్లబ్‌భాయిపటేల్ అని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. దేశవ్యాప్తంగా సర్దార్ వల్లబ్‌భాయి పటేల్ 150వ జయంతి ఉత్స వ వేడుకలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభు త్వాల సమన్వయం సహకారంతో నిర్వహిస్తుందన్నారు. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలోనూ భారీ ఎత్తున ర్యాలీ, ఐక్యతా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలు పక్కన పెట్టి ఒకటే జెండా మువ్వన్నెల జెండా, ఒకటే సిద్దాంతం భారత జాతి సిద్దాంతం అని గుర్తు చేస్తూ ఐక్యతా పాద యాత్ర, ర్యాలీలో పాల్గొనాలని ఆయన యువత కు పిలుపు నిచ్చారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంలో సర్దార్ వల్లబ్‌భాయి పటేల్ 150వ జయంతి ఉత్స వాలు వేడుకల పోస్టర్ "యూనిటి మార్చ్-వాక్ ఫర్ యూనిటీ, వాక్ ఫర్ భారత్"ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరా భారత్, జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్), ఎన్‌సిసి శాఖల ద్వారా సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ 150జయంతి ఉత్స వ వేడుకలను అత్యంగ ప్రతిష్టాత్మకంగ, ఘనంగా మునుపెన్నడు లేని విధంగ యువతను భాగస్వామ్యం చేస్తూ భవిషత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా పలు కార్యక్రమాల ప్రణాళిక ర... తెలిపారు.

మిగతా 3లో





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈటల

## సహాయ చర్యలు చేపట్టాలి

అధికారులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, అక్టోబరు 30 ప్రభాతవార్త :** భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉమ్మడి రంగారెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కూడా అయిన శ్రీధర్ బాబు గురువారం నాడు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, వాటర్ బోర్డు, ఆర్ అండ్ బి, విద్యుత్తు అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఫోన్‌లో మాట్లాడారు. వరద నీరు ప్రవేశించిన లోతట్టు కాలనీలు, గ్రామాలను మ్యాపింగ్ చేసి మరోసారి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలన్నారు. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం జరిగే ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వివరించారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు తక్షణ సాయం అందించడంతో పాటు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలన్నారు. అధికారులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి కూరగాయల తోటలు, వరి పొలాల పంట నష్టం అంచనాలు రూపొందించాలని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు.ఆర్టీసీ బస్సులు నిల్చిపోయిన గ్రామాల రహదారుల మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఎక్కడా అవాంతరాల్లేకుండా పనులు జరిగేలా చూడాలని సూచించారు.







4

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేస్తున్న దృశ్యం

## బాధిత రైతులకు ఓదార్పు ఏది?

పంట నష్టంపై క్షేత్రస్థాయికి రండి
ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్

**మేడ్చల్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తుఫాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి కష్టాల్లో ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కుర్చీ కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండల పరిధిలోని పూడూర్ శివారులో గల తన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వరి, మక్క పంటలు నీటమునిగి నాశనం అవుతుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పత్తి చెట్లమీదే రాలిపోయి మొలకలు వచ్చి బూజు పట్టి రైతులు ఆర్థికంగా కూలిపోయి గ్రామాల్లో విషాద వాతావరణం నెలకొందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుఫాన్ నష్టాన్ని

మిగతా 3లో

# నేటి నుంచి అనంతుడి జాతర

-భక్తుల కొంగు బంగారం శ్రీ అనంత పద్మనాభుడు..
-అబ్బుర పరిచే అనంత అందాలు..
-అనంత పద్మనాభ స్వామి జాతరను పురస్కరించుకుని ప్రత్యేక కథనం..



గర్భ గుడిలో కొలువైన శ్రీ అనంత పద్మనాభుడు

**వికారాబాద్, అక్టోబరు 30, ప్రభాత వార్త:** తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి అటవీ ప్రాంతం ఇక్కడి ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన వరం. అనంతగిరి అటవీ ప్రాంతంలో కాసేపు తిరిగితే చాలు..రోగ బాధలు సైతం దరిచేరవు. అనంతగిరిలో ఉన్న ప్రతి చెట్టు ఓ ఔషధ గుణం కలది. అందుకే ఈ ప్రాంతానికి ఓ నానుడి ఉంది. అనంతగిరి కా హవా...లాకో మరీంజోంకా దవా...అంటే లక్ష రోగాలకు అనంతగిరి నుంచి వీచే గాలి ఓ మందులా పని చేస్తుందని నానుడి ఉంది. అంతటి ప్రశాంత వాతావరణం అనంతగిరి సొంతం. అహ్లాదం..ఆరోగ్యానికి పెట్టింది పేరు అనంతగిరి అటవీ ప్రాంతం. ఇక్కడి ప్రకృతి సోయగాలు పర్యాటకులను ముగ్ధులను చేస్తాయి. ఇంతటి ప్రకృతి సౌందర్యం ఉన్న ప్రాంతంలో భక్తుల కొంగు బంగారమైన శ్రీ అనంతపద్మనాభస్వామి కొలువై ఉన్నాడు. స్వామి వారి జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో ఆలయ అధికారులు జాతర ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అనంతగిరిలో కార్తీమాస జాతర ఉత్సవాల సందడి మొదలు కావడంతో పర్యాటకుల తాకిడి సైతం మరింత



విద్యుత్ దీపాలంకరణలో వెలుగుతున్న ఆలయం

పెరిగింది. పర్యాటకులు, భక్తులతో ఆలయ ప్రాంగణం ఎంతో కోలాహలంగా మారింది.

## -ఆలయ ప్రాశస్త్యం....

అనంతగిరి అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయానికి1300 ఏండ్ల చరిత్ర ఉంది. కొన్ని వేల సంవత్సరాలకు పూర్వము మృకండు తనయుడైన మార్కండేయుడు శివ సాక్షాత్కారం అనంతరం పూర్ణాయుష్కుడవుతారు. బ్రహ్మదేవుని ఆరాధించి, బ్రహ్మ ఆదేశానుసారం భూమం డలంలోని భరత ఖండమైన ఆది శేషుని పుచ్ఛ భాగం అనబడు అనంతగిరిలో నిర్విఘ్నంగా తపస్సు ఆచరించమని చెబుతాడు. బ్రహ్మ ఆదేశానుసారం మార్కండేయుడు అనంతగిరిలోని ఓ గుహలో తపస్సు ఆచరించి శ్రీ మహా విష్ణువు దర్శనం పొందుతాడు. ఏం వరం కావాలో కోరుకో అని విష్ణువు అడుగగా...శ్రీ అనంత పద్మనాభునిగా సాలగ్రామ రూపంలో నిలబడి స్వయంభూగా వెలయాలని వరం కోరుతాడు. మార్కండేయుని కోరిక మేరకు శ్రీ అనంత పద్మనాభ స్వామిగా సాలగ్రామ రూపంలో స్వయంభూగా స్వామి వారు ఇక్కడ వెలిశారు. మార్కండేయ రుషి తపస్సు చేసిన గుహ ఇప్పటికీ చరిత్రకు ఆనవాళ్ళుగా అగుపిస్తుంది. అనంత పద్మనాభ స్వామి ఎక్కడ ఉన్న ఆదిశేషునిపై శయనించి దర్శనమిస్తాడు. ఇక్కడ మాత్రం స్వామి వారు నిలబడి భక్తులకు దర్శనమిస్తాడు. ఈ ఆలయ ప్రత్యేకతలో ఒకటిగా ఇక్కడి భక్తులు చెబుతుంటారు.

## -అనంతగిరి నుంచి కాశీ వరకు గుహ మార్గం...!

మార్కండేయుని కోరిక మేరకు అనంతగిరిలో వెలసిన శ్రీ అనంత పద్మనాభునికి మార్కండేయ రుషీ నిత్య పూజలు చేస్తూ ఆరాధించేవారు. మార్కండేయుని పూజలో విశేషముగా చెప్పుకోదగినది ప్రతినిత్యం గుహ మార్గంలో కాశీ వెళ్ళి గంగానది నీళ్ళు తెచ్చి జలాభిషేకం చేసేవాడని చరిత్ర చెబుతుంది. ఈ సంఘటనకు ఆనవాళ్ళుగా స్వామి వారి గర్భగుడిలో కాశీ గుహ మార్గం దర్శనమిస్తుంది. ఆ గుహలోకి కోతులు, ఇతర జంతువులు వెళ్ళి మృతి చెందుతుండటంతో ఆ గుహ మార్గాన్ని ఆలయ అధికారులు మూసివేశారు. మానవాతీత శక్తులు గలవారే ఈ మార్గంగా గుండా కాశీ వెళ్ళివస్తారని, అన్యులకు సాధ్యం కాదని ఆలయ అర్చకులు చెబుతున్నారు.

## -మూసీ నది జన్మస్థలం అనంతగిరిలోనే....

కృష్ణా నది ఉపనదిగా పిలువబడే మూసీ నది జన్మస్థలం అనంతగిరియే. ఆలయ కోనేటి ఆవరణలో మూసీ నది జన్మించింది. మూసీనది పుట్టుకకు సైతం ఆలయ చరిత్రతో ముడిపడి ఉంది. పూర్వం ముచుకుందుడు అనే రాజర్షి రాక్షసులతో అనేక సంవత్సరాలు యుద్ధము చేసి విజయం సాధిస్తాడు. స్వర్గలోకాధిపతియైన దేవేంద్రుని కొలిచి..భూలోకములో తన అలసట తీర్చుకొ నుటకు, సుఖ నిద్ర పొందుటకు ప్రశాంత స్థలము తెలుపుమని కోరుతాడు. తన నిద్రాభంగం చేస్తే తీక్షణ చూపులతో భస్మం కావాలని వరం కోరుతాడు. అనంతగిరి క్షేత్రము నీ సుఖ నిద్రకు అనుకూలమని, నిద్రా భంగం చేస్తే తీక్షణ చూపులకు భస్మం అవుతారని వరం ఇస్తాడు దేవేంద్రుడు. దేవేంద్రుని సూచన మేరకు అనంతగిరిలోని ఓ గుహలో ముచుకుందుడు నిద్రకుపక్రమిస్తాడు. ఇదిలా ఉండగా ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా అవతరించిన శ్రీమహావిష్ణువు ద్వారకానగరాన్ని పాలిస్తుండగా, కాలయవ్వనుడు అనే రాక్షసుడు వరగర్వముతో ద్వారక నగరంపై దండెత్తి యాదవ సైన్యాన్ని నాశనం చేస్తాడు. బలరామ కృష్ణులు కాలయవ్వనుడికి భయపడినట్లు నటించి అనంతగిరిలో ముచుకుందుడు నిద్రిస్తున్న గుహలోకి ప్రవేశిస్తారు. ముచుకుందుడిపై బలరామ కృష్ణుల వస్త్రాలు వేసి గుహలో ఓ చోట దాక్కుంటారు. ఇది గమనించని కాలయవ్వనుడు ముచుకుందుడే బలరామ కృష్ణులని భావించి వస్త్రాన్ని తొలగించి ముచుకుందునికి నిద్రాభంగం కలిగిస్తాడు. ఆగ్రహించిన ముచుకుందుడు తీక్షణ చూపులతో కాలయవ్వనుడిని భస్మం చేస్తాడు. వెంటనే బలరామ కృష్ణులు ముచుకుందునికి దర్శనమిస్తారు. ముచుకుందుడు తన్మయత్వం పొంది బలరామ కృష్ణుల పాదాలు కడిగి సాక్షాత్కారం పొందుతాడు. బలరామ కృష్ణుల కాళ్ళు కడిగిన నీళ్ళే ముచుకుందా నదిగా జన్మించింది. కాల క్రమేణా ముచుకుందా నది...మూసీ నదిగా పిలువ బడుతుంది.

## -కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైన స్వామి

వందల ఏండ్ల చరిత్ర ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి జాతర ఉత్సవాలు ప్రతియేటా రెండు మార్లు నిర్వహిస్తారు. ఆషాడ శుద్ధ ఏకాదశి, కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున చిన్న జాతర, పెద్ద జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ జాతర ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. ఆలయ కోనేటిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాలు అక్టోబర్



అనంతగిరిలో వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం



ఆలయ కోనేరు

31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అధికారులు తెలిపారు. 31వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ధ్వజారోహణం, పుణ్యాహవాచనంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. నవంబర్ 2 న ఏకాదశి పూజా కార్యక్రమాలు, 3వ తేదీ రాత్రి 7 గంటలకు తులసీ కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తేదీ బుధవారం పౌర్ణమి రోజు సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం, రాత్రి 9.30 గంటలకు స్వామి వారి రథోత్సవము నిర్వహించనున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. 6న ఉదయం 11 గంటలకు గరుడ వాహనసేవ, 7న ఉదయం 11 గంటలకు ముత్యాల పందిరి సేవ, 8న ఉదయం 11 గంటలకు గజ వాహన సేవ, 14వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు చక్రతీర్థంతో స్వామివారి జాతర ఉత్సవాలు ముగింపు అవుతాయని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు జాతర ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

## రైతులు జాగ్రత్తలు పాటించాలి

**జిల్లేడు చౌదరిగూడెం, అక్టోబరు ,30 (ప్రభాతవార్త):** మండలంలోని రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పొలాల్లో పొలంలో ఉన్న నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని అన్నారు. అవకాశాన్ని బట్టి పడిపోయిన చేను పైకి లేపి కట్టుకోవాలి , నిలబడి ఉన్న పడిపోయిన చేలల్లో గింజలు రంగు మారటం మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొపికోనజోల్ పిచికారి చేయాలని తెలిపారు. అదేవిధంగా గింజ గట్టి పడే దశలో ఉన్న వరి రకాలు నిరంతర వర్షాల వల్ల గింజలోనిద్రావస్థ తొలిగి నిలబడి ఉన్న పడిపోయిన చేలలో మొలక వచ్చే అవకాశం ఉందని అన్నారు. కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనబడితే నీరు బయటకు తీసివేసిన తర్వాత ఐదు శాతం ఉప్పు ద్రావణం లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు

**రంగారెడ్డి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలోగల శ్రీ మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని 9 రోజున ఆకాశ దీపారాధన చేయడం జరిగిందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మించండి!

**కొందుర్గు అక్టోబరు 30 ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రహరీ గోడ లేనందున అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్టాండు చుట్టుపక్కల ప్రహరి కూడా లేనందున ప్రైవేటు వాహనదారులు ఇష్టం వచ్చినట్లు లోపలికి వచ్చి వెళుతున్నాయనీ ప్రయాణికులు తెలిపారు. అంతే కాకుండా బస్టాండ్ ఆవరణలోని పెద్ద పెద్ద క్రేన్లు, జెసిబిలు ,టిప్పర్లు ,ట్రాక్టర్లు ,కార్లు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ స్థలము ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని కొందరు వాపోతున్నారు .ప్రయాణికుల సౌకర్యం తమ ధ్యేయమని పదేపదే చెప్పే ఆర్టీసి ఇక్కడ ప్రహరీ గోడ నిర్మించకపోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో మండల కేంద్రం చెందిన యువకులు బస్టాండ్లో మోలిక వసతులు కల్పించాలని, డిమాండ్‌తో పలుమార్లు నిరసనలు వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మించారని , ప్రహరీ గోడ నిర్మించలేదని పలువురు అన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బస్టాండుకు ప్రహరీ గోడ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వరి,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రంగారెడ్డి, అక్టోబరు 30 (ప్రభాతవార్త):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా అందేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి డైరెక్టర్ యాదమ్మ మార్కెట్ డైరెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకుర్ ప్రభాకర్ రెడ్డి పీసీసీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచులు కడమోని శ్రీశైలం రమేష్ యాదవ్ జైపాల్ రెడ్డి వ్యవసాయ అధికారి రేణుక పిఎసిఎస్ సీఈవో ప్రతాప్ రెడ్డి గ్రామస్తులు జగ్గారెడ్డి గౌస్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



**కేశంపేట అక్టోబర్ 30 ప్రభాతవార్త :** కేశంపేట మండలం పరిధిలోని పాపిరెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం నషా ముక్త్ భారత్ కార్యక్రమం మండల శిశు సంక్షేమ శాఖ అధికారి దివ్య సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. శ్రీశైలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎం. చంద్రశేఖర్ ప్రధాన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నషా ముక్త్ భారత్" కార్యక్రమం ఎంతో అవసరమని తెలిపారు. సమాజంలో ప్రతి వ్యక్తి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, సూర్యకాంత్, సువర్ణ, శ్రీదేవి, లావణ్య, నాగరాజు తదితరులు విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించే ప్రతిజ్ఞ చేశారు.అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విజయవంతంగా ముగిసిన నాస్మత్ భారత్



విద్యార్థులకు మదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తాం

**షాద్‌నగర్ టౌన్, అక్టోబరు 30 ,ప్రభాతవార్త :** ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్రం కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఇంటర్మీడియట్, డిగ్రీ,పారామెడికల్, ఇంజనీరింగ్, మరియు లా కళాశాలలో బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. అందులో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలల బంద్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు సుమారుగా 8500 కోట్ల పెండింగ్స్ స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల కావాల్సిన ఉంది అని కానీ ప్రభుత్వం మాత్రం తమకు ఎం పట్టనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ నాలుగు సంవత్సరాల నుండి విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట ఆడిందని అందుకే విద్యార్థులంతా ఏకమై గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారు అని అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి విద్యార్థులకు స్కాలర్షిప్స్ లేకుండా గత ప్రభుత్వం చేసిన తప్పిదమే ఈ ప్రభుత్వ కూడా చేస్తున్నది ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి విద్యార్థుల వైపు చూడాలని అన్నారు... లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని అని హెచ్చరిస్తావున్నాం. విద్యార్థులుపై చదువులు చదువుకోడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు మంత్రిని కేటాయించి విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలని చేయనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరిస్తా ఉన్నాం.. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ కమిటీ కార్యదర్శి శివశంకర్ ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, చింటూ, వంశీ చంద్ర, కార్తీక్, అమీర్ బాబా,బబ్లు, సాయి,విజయ్, హరి, నవదీప్, శివ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిసిపి సునీతా రెడ్డి,తదితరులు

## పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

### మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30 ,ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డిజిపి శివధర్‌రెడ్డి,రాచకొండ సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో ఏసిపి కెపివి రాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరాన్ని డిసిపి సునీతా రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అమరవీరులను స్మరిస్తూ వారి త్యాగాలను గుర్తుచేస్తూ వారికి ఘన నివాళులు అర్పించారు.మొత్తం ఆరు పోలీసు స్టేషన్ల ఎస్ హెచ్ వో లు,సిబ్బంది పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారని తెలిపారు.ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ఆదిభట్ల,యాచారం,మంచాల,మాడుగుల,గ్రీన్ ఫార్మ సిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది హాజరయ్యారు.ఈ యొక్క కార్య క్రమంలో సిఐలు నందీశ్వర్ రెడ్డి,మహేందర్ రెడ్డి,మధు ,రవికుమార్,సత్యనారాయణ,వేణుగోపాల్, ఎస్సైలు,పోలీసు సిబ్బంది,యువజన సంఘాల సభ్యులు,క్రీడాకారులు,వివిధ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థిని,విద్యార్థులు,ప్రజలు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు

## పాఠశాలలో పశువులను మేపొద్దు

**కేశంపేట , అక్టోబరు 30 ,ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో హై స్కూల్ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన కల్ప మొక్కలు, గడ్డి ని నియంత్రించేందుకు గురువారం కలుపు మందు స్ప్రే చేశామని పరిసరాల రైతులు విషయాన్ని గమనించి పాఠశాల ప్రాంగణంలో కి పశువులను, మేకలను, గొర్రెలను తీసుకువెళ్లొద్దని గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తెలిపారు.





పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో కలిసి సమావేశమైన మాజీ ఎంపీపీ

## జూబ్లీహిల్స్ మాదే..!

### నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం

**నందిగామ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్ గురువారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గడపగడపకు చేర వేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతి కార్యకర్త గెలుపును సీరియస్ గా తీసుకొని ప్రచారంలో అడుగులు ముందుకు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత పదేళ్ల కాలంలో బి ఆర్ ఎస్ పార్టీ ప్రజలకు ఒరుగబెట్టింది ఏమీ లేదని, నియంతృత్వ కుటుంబ పాలనలో దోచుకోవడం దాచుకోవడమే పనిగా పెట్టుకున్నా సంగతి ప్రజలందరికీ తెలిసిందేనని , ఈ ఎన్నికల్లో నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## వ్యక్తి అదృశ్యం...!

**నందిగామ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో నరసింహులు (55) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు నందిగామ ఎస్ఐ దేవరాజ్ తెలిపారు. కోలగా ఉన్న మొఖం, రంగు చామన చాయ, తెల్ల పంచ, తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడు. తప్పి పోయిన నరసయ్య ఆచూకీ కోసం చుట్టాలను, బంధుజనాలను ఆరా తీసిన ఆచూకీ లభించ లేదని వాపోయారు. ఈ సంఘటన విషయమై ఈనెల 25వ తేదీన స్రవంతి అనే మహిళ నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.



తప్పిపోయిన నరసయ్య (ఫైల్ ఫోటో)

## మహిళా సమాఖ్య అవగాహన సదస్సు

**నందిగామ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నందిగామ మండల



నందిగామలో మహిళా సమాఖ్య సమావేశం దృశ్యం

కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వయోజన విద్య ఉల్లాస్ పైన గ్రామ సంఘం అధ్యక్షురాలకు , గ్రామ సంఘం వివోఏలకు సిఆర్పిలచే సెక్షన్ ఇవ్వడం జరిగిందని డిఆర్డిఏ ఏపీఎం భగవంతు తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవిష్యత్తులో అనుసరించబోయే అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. షాద్నగర్ పట్టణంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు షాద్నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి జిల్లా పీడీ శ్రీలత తో పాటు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల సమైక్య పాలకవర్గం అమృత, అపరంజిత, అరుంధతి, భాగ్యమ్మ ,సీసీలు అనురాధ, అమృత ,వివోఏలు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభోగమే.. !

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు



నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

**నందిగామ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** నందిగామ మండలం తాటిగడ్డ తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, జటావత్ లక్ష్మణ్ నాయక్ మేనకోడలు సంగీత వివాహం షాద్నగర్ పట్టణంలోని కుంట్ల ర్నా రెడ్డి ఫంక్షన్ హాల్ లో గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, వై అంజయ్య యాదవ్, కొత్తూరు ఉమ్మడి మండలాల మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్ లుపలువురు రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులు సంగీత సంతోష్ కుమార్ లను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో షాద్నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, చెంది తిరుపతిరెడ్డి, రాంబల్ నాయక్, నందిగామ మాజీ సర్పంచ్ లు జిల్లెల్ల వెంకట్ రెడ్డి , జటావత్ రాజునాయక్,ఎనుగొండ రమేష్ గౌడ్, నాయకులు శేఖర్ ,నవపేట్ రాజశేఖర్ గౌడ్, సాంబయ్య, కృష్ణ, జటావత్ శ్రీను నాయక్, పలువురు రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు విచ్చేసి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## నిరుపేదలకు అండగా ఉంటా

**కీసర, అక్టోబరు30, ప్రభాతవార్త:** నిరుపేదలకు అండగా ఉంటానని మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శేత రాజు ముదిరాజు అన్నారు.గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని నివాసం ఉండే పుష్ప కుమార్తె శ్యామల వివాహనికి తాళి బొట్టు,మెట్టలు అంద జేశారు.ఈ కార్య క్రమంలో ఆర్‌జికే కాలనీ వెల్ఫేర్ అసో సియేషన్ కమిటీ ఉపా ధ్యక్షులు రాజ్‌కుమార్,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు ముప్పా రామా రావు,ఆర్‌జికే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,ఆర్‌జికే కాలనీ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈగ రాజు ముదిరాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



శ్యామలకు తాళి బొట్టు,మెట్టలను అందజేస్తున్న మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ముదిరాజు

## పర్యాటకం ముసుగు...లే అవుట్ లొసుగు

(మొదటి పేజీ తరువాయి)

అయితే..ఖాళీ స్థలంలో గుడారాలు వేసి పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు. వచ్చిన పర్యాటకులకు రిసార్టు అందాలు ఎర వేసి, హరిత రిట్రీట్ లే అవుట్ బ్రోచర్ చూపించి ప్లాట్లు విక్రయిస్తున్నారు. లే అవుట్‌కు డీటీసీపీ అనుమతులు 39 ఎకరాలకు పొందినప్పటికీ వారి బ్రోచర్లలో మాత్రం 150 ఎకరాలు డీటీసీపీ అనుమతులు ఉన్నాయని తప్పుగా ముద్రించి కొనుగోలు దారులను తప్పుదోవ పట్టిస్తున్నారని లే అవుట్ యాజమాన్యంపై పలువురు మండిపడుతున్నారు. ఈ వ్యాపారులు కొనుగోలు చేసిన భూమి మధ్యలోనే 6 ఎకరాలు అసైన్డ్ పట్టా భూమి సైతం ఉంది. ఈ భూమిని గతంలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి, దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ కోసం, రైతుల వద్ద నుంచి పట్టా భూమిని కొనుగోలు చేశారు. ఈ ప్రభుత్వ భూమిని పైలెట్ ప్రాజెక్టు కింద గొట్టిముక్కుల గ్రామానికి చెందిన ఇద్దరు దళిత కుటుంబాలకు భూ పంపిణీ చేసి అసైన్డ్ పట్టా పాసు పుస్తకాలను అందజేశారు. ప్రస్తుతం రియల్ వ్యాపారులు కొనుగోలు చేసిన 150 ఎకరాల భూమికి మధ్యలో ఈ అసైన్డ్ పట్టా భూమి ఉండటంతో కనెక్టివిటీ ఇబ్బందికరంగా మారింది. ఇందులో భాగంగానే వీరికి పూర్తి స్థాయిలో డీటీసీపీ అనుమతులు రాలేవని పలువురు చర్చించుకుంటున్నారు.

**-అక్రమ నిర్మాణాలతో గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి..**

గ్రామాల్లో నిరుపేదలు అనుమతులు లేకుండా ఏదైన చిన్న ఇంటి నిర్మాణం చేస్తేనే ప్రతాపం చూపే సంబంధిత అధికారులు, అనంత రిసార్టులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన అధికారులు నోరు మెదపడం లేదు. పైగా ఆ నిర్మాణాలు తాత్కాలిక నిర్మాణాలు అంటూ సర్దిపుచ్చుకుంటున్నారు. పునాది తీసి, పిల్లర్లు వేసి షెడ్డు వంటి నిర్మాణాలు చేపడితే..తప్పని సరి గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కంటైనర్, ఇతర తాత్కాలిక నిర్మాణాలకు మాత్రం గ్రామ పంచాయతీ అనుమతులు అవసరం ఉండదు. ఇలాంటి చిన్నపాటి లొసుగులతో రిసార్టు యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై గ్రామ పంచాయతీ ఆదాయానికి గండికొట్టే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిసార్టులో పునాదులు తీసి, పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపట్టినా..సంబంధిత శాఖ అధికారులు మౌనం వహించడంపై అధికారుల తీరును పలువురు తప్పు పడుతున్నారు. రిసార్టులో స్విమ్మింగ్‌పూల్, కాటేజ్‌లు, ఆకర్షణీయమైన రోడ్లు వేసి పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు. వీకెండ్ వస్తే చాలు..రిసార్టు పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఒక్కో కాటేజీకి రూ.10 వేలు, కాటేజీ బుకింగ్ పూర్తి అయితే గార్డెనింగ్ స్థలంలో దాదాపు 100 నుంచి 200 గూడారాలు వేసి పర్యాటకులకు బస ఏర్పాటు చేస్తారు. ఈ గుడారాలకు ఒక్కోదానికి రూ.4 వేలు నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా లక్షల్లో ఆదాయం ఆర్జిస్తూ గ్రామ పంచాయతీ ఆదాయానికి మాత్రం గండికొడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

**-రిసార్టుకు ఉండాల్సిన నిబంధనలు ఇవీ..**

ఏదైన రిసార్టు ఏర్పాటు చేస్తే ఈ నిబంధనలు తప్పనిసరిగా ఉండాలి. భూమికి సంబంధించిన సేల్‌డీడ్ డాక్యుమెంట్లు, పాస్‌బుక్, రెవెన్యూ శాఖ జారీ చేసిన ల్యాండ్ కన్వెన్షన్ కాపీ, సర్వే మ్యాప్, టంచ్ మ్యాప్, గ్రామ రెవెన్యూ ఓల్డ్ మ్యాప్, కడస్టల్ మ్యాప్, నీటి పారుదల శాఖ వారు జారీ చేసిన ఎన్‌ఓసీ, అటవీశాఖ వారు జారీ చేసిన ఎన్‌ఓసీ, అగ్నిమాపక వారు జారీ చేసిన ఎన్‌ఓసీ, ఈసీబీసీ సర్టిఫికేట్, ఎస్టీఓ చాలాన్లు, సైట్ ప్లాన్ కాపీ, మొత్తం సైట్ ప్లాన్, లొకేషన్ ప్లాన్, సెక్షన్ ఎలివేషన్, గూగుల్ ప్లాన్, అధికారిక ఇంజనీర్ ధృవీకరణ పత్రం వంటి నిబంధనలు రిసార్టు ఏర్పాటు చేసే వారు తప్పనిసరి తీసుకోవాల్సి ఉంటుంది. వీటిలో సగం వరకు సైతం అనంత రిసార్టు వారికి లేవన్నది అధికారులు చెప్పిన సమాచారం.

**తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం : డీపీఓ జయసుధ**

హరిత రిట్రీట్ వారు 39 ఎకరాలకు మాత్రం డీటీసీపీ అనుమతులు పొందారు. వారు తీసుకున్న అనుమతుల మేరకే ప్లాట్లకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టాలి. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం, దానికి అనుకుని ఉన్న అనంత రిసార్టుకు అనుమతులు లేవని తమ దృష్టికి వచ్చింది. సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే, సంబంధిత రిసార్టు నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు డీపీఓ జయసుధ వివరణ ఇచ్చారు. ఈ విషయమై ఎంపీఓ కు నివేధిక సమర్పించాలని ఆదేశించినట్లు డీపీఓ తెలిపారు.

## అందరిచూపు ఢిల్లీ వైపు

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది నేతలు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఐదు సంవత్సరాలు కాంగ్రెస్‌లో నిలకడగా ఉన్న నాయకుడు ఎవరూ లేరని, అందరూ ఇతర పార్టీలకు వెళ్లి తిరిగి చేరిన వారే అని వారు అంటున్నారు. అనుభవం లేనివారికి అవకాశం ఇవ్వరని చెప్పి ఇప్పుడు అదే నాయకులు దరఖాస్తులు స్వీకరించడం పై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అర్హతలేని వారిని ఆమోదిస్తే నిబంధనలు ఎందుకు పెట్టారనే ప్రశ్న పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

తుది నిర్ణయం ఢిల్లీ చేతుల్లో....

మొత్తంగా, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి పదవి ఎవరికి దక్కబోతుందనే ఉత్కంఠ పెరిగిపోతోంది. అందని నేతల చూపు ఇప్పుడు ఢిల్లీ వైపే ఉంది. ఏఐసీసీ త్వరలో నిర్ణయం తీసుకోనుందని, ఆ నిర్ణయం జిల్లాలోని కాంగ్రెస్ భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపుగా మారబోతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## పార్టీలు పక్కనపెట్టి పటేల్‌కు జై కొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 8కె ర్యాలీ,ఐక్యతా పాదయాత్ర కార్యక్రమాన్ని అక్టోబరు 31న నిర్వహించాల్సి ఉండగ మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వాయిదే వేసిన త్వరలోనే వారంలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపి ఈటల రాజేందర్ తెలిపారు. జిల్లా స్థాయిలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగ నిర్వహించనున్నట్లు తెలిపారు. 15నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారందరు దీనిలో పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఇన్‌చార్జి అధికారులను నియమించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించటానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్ర్యం పునర్నిర్మాణంలో భాగస్వాములైన త్యాగధనులను ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకుంటూ, యువతలో ఐక్యతా భావం మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ ఆలోచనలకు అనుగుణంగ ఈ కార్యక్రమం రూపొందించబడినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా యువతీ,యువకులు మైభారత్ వెబ్‌సైట్‌లో వివరాల నమోదు చేసుకోవాలని యువతను కోరారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వివిధ పోటీలు యువతీ,యువకులకు కూడ పోటీలు ఉంటాయని అన్నారు. చిత్ర ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నవంబర్ నెలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికలు చేసి విజేతలను ప్రకటిస్తారని, ఈ పోటీల ద్వారా జాతీయ స్థాయిలో ఎంపికైన 150మంది కేంద్ర యువజన వ్యవహారాలు కేంద్ర మంత్రితో జాతీయ ఐక్యతా పాదయాత్రలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపి ఈటల రాజేందర్ తెలిపారు. వైద్య శిబిరాలు, సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జీవితంపై ప్రసంగాలు, సమైఖ్యత, డ్రగ్స్ రహిత భారత్ యువత ప్రజలతో ప్రతిజ్ఞ, బహిరంగ ప్రదేశాల్లో వీధినాటకాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయనున్నట్లు వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో జిల్లా స్థాయిలో ఐక్యతా పాదయాత్రలు కలెక్టర్,ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా మంత్రితో జరుగుతుందన్నారు. అక్టోబరు 31నుంచి నవంబరు 25వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో రెండు పాదయాత్రలు, వికారబాద్ జిల్లాలో ఒకటి, మేడ్చల్ జిల్లాలో ఒకటి పాదయాత్ర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అందరు భాగస్వాములు కానున్నట్లు ఆయన వివరించారు. జాతీయ స్థాయి ఐక్యతా పాదయాత్ర నవంబరు 26నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రలో ఎంపిక చేసిన వారితో 152కి.మీ.తో సాగే ఐక్యతా పాదయాత్ర శోభాయమానంగ డిసెంబరు 6న గుజరాత్‌లోని సర్దార్ వల్లబ్‌భాయి పటేల్ విగ్రహం వద్ద ముగుస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనటం జరుగుతుందని ఎంపి ఈటల రాజేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మైభారత్, యువజన ఆఫీసర్ ఐజయ్య, మేడ్చల్ జిల్లా యువజన,క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి విశ్వనాథ్, విజయకుమార్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సుధాకర్, మేడ్చల్ నియోజకవర్గ బిజెపి నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, నాయకులు అమరం మోహన్‌రెడ్డి పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బొప్పాయే..

(మొదటి పేజీ తరువాయి)

ఇట్టి పర్యటనలో ఫరూఖ్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఫరూక్ నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

మంచాల మండల పరిధిలో బుధవారం కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలో చిత్తాపూర్, నోముల, మంచాల, బోడకొండ,ఎల్లమ్మ తండా,దాద్ పల్లి..పలు గ్రామాలలో 16 మంది రైతులకు చెందిన 25 ఎకరాల పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.పంట నష్టం నివేదికను ఉన్నతాధికారుల కు నివేదిస్తామని తెలియచేశారు.ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిసిరి, లింగస్వామి,రైతులు లక్ష్మణ్, చాంది,బాలాజీదాస్,సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు. మంచాల మండలం ఆరుట్లలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకొంటామని మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.గురువారం తుఫాన్ కారణంగా కూలిపోయిన ఆరుట్ల గ్రామానికి చెందిన గట్ల గణేష్, నూకం రమేష్,చిందం యాదయ్య, బొద్రమోని మల్లేష్, నూకం బన్ని, తదితరుల ఇండ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తుఫాను వల్ల ఇండ్లు కూలిపోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు విషయంలో తమ వంతు కృషి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, మార లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్, సురేష్, వెంకటేశ్, మల్లేష్, బాలరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

### పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన నాయకులు, కార్మికుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు, మధ్యాహ్న కార్మికులు ధర్నా చేశారు. బిల్లులు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న బోజన కార్మికులు,సిఐటియు నాయకులు ధర్నా చేసి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ మిడ్‌డేమిల్స్ పథకం వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు కె.ఉన్నికృష్ణన్, కార్యదర్శి ప్రేమలత ల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కె.ఉన్నికృష్ణన్, కార్యదర్శి ప్రేమలత లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి బిల్లులు వేతనాలు అందలేదని, పండుగలు కూడ చేసుకోని దౌర్భాగ్య పరిస్థితిని ఎదుర్కోవటం జరిగిందన్నారు. నెలల తరబడిగా పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే పాఠశాలలో విద్యార్థులకు ఎలా మధ్యాహ్న భోజనం అందిస్తారని అయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, వేతనాలు చెల్లించాలని, మధ్యాహ్న బోజన కార్మికులను ఆదుకోవాలని, వారికి వేతనాలు కూడ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ తరువాత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వారితో పాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, మధ్యాహ్న భోజన నాయకురాలు విజయలక్ష్మి, మంజుల, జయ, తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

### -విద్యార్థులకు వక్తృత్వ పోటీ..బహుమతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న టిజిబి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్

**ఘట్‌కేసర్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** సమాజంలో అవినీతిని అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ టి.చంద్రశేఖర్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌లోని బుద్వేల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ, పిజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శారద ఆధ్వర్యంలో గురువారం జాతీయ విజిలెన్ వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఘట్‌కేసర్‌శాఖ ద్వారా 'జాగరుకత మన సమిష్టి బాధ్యత' అనే అంశంపై విద్యార్థులు అధ్యాపకులు, బ్యాంకు అధికారులు చర్చించారు. విద్యార్థులకు అవినీతి నిరోధకతపై వక్తృత్వ పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రసంగానికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో టిజిబి సీనియర్ మేనేజర్ (ఆపరేషన్స్) పి.సత్యవాణి, ఘట్‌కేసర్ శాఖ మేనేజర్ వై.ఉదయశ్రీ, అవుషాపూర్ శాఖ మేనేజర్ జి.అజేష్‌కుమార్, ఫీల్డ్ అధికారి డి.రాములు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ బైపాస్ నుండి చలివేంద్రగూడ వెళ్లే రహదారి మడుగులను తలపిస్తున్న దృశ్యం

## వర్షానికి రహదారులు ధ్వంసం

**నందిగామ,అక్టోబరు 30, ప్రభాతవార్త:** తుఫాన్ కారణంగా గత కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రహదారుల ధ్వంసమై గోతుల మయాన్ని తలపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నందిగామ బైపాస్ నుండి సల్వేంద్రిగూడ వెళ్లే రహదారి ధ్వంసమై కంకర తేలి, గోతులు పడి మడుగులను తలపిస్తున్నాయి. అప్పరెడ్డి గూడా నుండి వీర్లపల్లి వెళ్లే రహదారి, నందిగామ నుండి అంతిరెడ్డిగూడ మీదుగా నర్సప్పగూడ వెళ్లే ధ్వంసమై గోతులు పడి నీళ్ళు నిలిచి వచ్చిపోయే వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నందిగామ నుండి లింగమూర్తుల వాగు మీదుగా వీర్లపల్లి వెళ్లే రహదారి గోతుల మయమై నరకాన్ని తలపిస్తున్నాయి. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత శాఖ ఆర్ అండ్ బి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రికి సమస్యలు వివరిస్తున్న అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ తదితరులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సభ్యులు కేంద్రమంత్రిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. సికింద్రాబాద్‌లో బిల్డర్‌లు అప్పులు తెచ్చి భవనాలు నిర్మిస్తే నిబంధనల పేరుతో విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే నిర్మించిన భవనాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నోచుకోవడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అప్పులు తీర్చలేకపోతామని వివరించారు. వడ్డీటు కట్టలేక నానా అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. మురికి వాడల ప్రాంతాలు అధికంగా ఉన్న సికింద్రాబాద్‌లో వంద, రెండు వందల గజాలకు మించిన స్థలాలు లేవని, కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నవారు ఇండ్లు నిర్మించుకోలేక తమను ఆశ్రయిస్తున్నారన్నారు. నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతుండడం వల్ల నిర్మాణాలు జరుపుకోలేక అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. సమస్యలు విన్న మంత్రి కిషన్‌రెడ్డి త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపినట్లు అసోసియేషన్ కన్వీనర్ శ్యాంసుందర్ తెలిపారు.

## బాధిత రైతులకు ఓదార్పు ఏది?

(మొదటి పేజీ తరువాయి)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

అంచనా వేస్తూ రైతులను ఓదారుస్తుండగా తెలంగాణలో ప్రజలను పట్టించుకునే నాథుడే లేదని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మహబూబ్నగర్ జిల్లాల్లో లక్షల ఎకరాలు పంటలు లేకుండా పోయాయని, భీమదేవరపల్లి మండలంలో 41 సెంటీమీటర్ల వర్షం పడింది కానీ సీఎంకి పట్టదా? ముఖ్యమంత్రి మీ కుర్చీ మీద కూర్చొని లెక్కలు వేసుకోవడం మానేసి, నేలమీదకు వచ్చి రైతులను ఆదుకోండని ఆయన డిమాండ్ చేశారు. మీ దందాలు, వసూళ్లు, అంతర్గత కుమ్ములాటలు పక్కనపెట్టి ప్రజల బాధలు తెలుసుకోవాలని హితవు పలికారు. పంటలు, ఇళ్లు నీటమునిగి నష్ట పోయాయని, పేద రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని, ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని, మీ మంత్రులు ఒకరిపై ఒకరు కొట్లాడుతుంటే ప్రజలు చీకట్లో మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అధికారం శాశ్వతం కాదని, నేలమీదకు దిగివచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు.

రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో పదివేల కోట్ల రూపాయలు బకాయిలుగా ఉన్నాయని, ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోవడంతో కాలేజీలు విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్నాయని తెలిపారు. పేద విద్యార్థులు చదువులు మానేసే స్థితికి చేరుకున్నారని, భూములు అమ్మి వచ్చిన వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు ఇస్తున్నారు కానీ విద్యార్థులకు ఇవ్వడానికి మాత్రం చేతులు రావడం లేదని ఆరోపించారు. కళాశాలలు డబ్బులు అడిగితే విజిలెన్స్ దాడులు చేయిస్తున్నారని, ఇది పేదలపై దాడి అని ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీల్లో పనులు చేసిన సర్పంచులు, వార్డు మెంబర్లు బిల్లులు రాక అప్పుల పాలై ఆత్మహత్యలకు దిగుతున్నారని, దసరాకు చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ చెల్లించకపోవడం అత్యంత దారుణమైన పరిస్థితని ఎంపీ అన్నారు. ప్రజల కోసం పనిచేసిన వారినే ప్రభుత్వం మోసం చేస్తోందని గ్రామీణ అభివృద్ధి పూర్తిగా స్థంభించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పని కెసిఆర్‌కీ చేశారు. గతంలో కెసిఆర్ అధికారం, డబ్బుతో ప్రజలను మోసం చేయడంతో చివరికి ప్రజలే తీర్పు చెప్పారన్నారు. రేవంత్ రెడ్డి కూడా అదే దారిలో వెళ్తే ప్రజలు ఇప్పుడు మిమ్మల్ని ఏమీ అనకపోవచ్చు కానీ సమయం వచ్చినప్పుడు కర్ర కాల్చి వాత పెడతారని అన్నారు. ప్రజలను అణిచివేతకు గురి చేయడం, బలహీన వర్గాలను పట్టించుకోకపోవడం మీ పాలనకు ముప్పు అవుతుందని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారం దోపిడి కోసం కాదని, అది సేవ కోసం అని గుర్తుంచుకోండని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు సుదర్శన్, బోడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

### -ఎస్‌ఎఫ్‌ఐ కళాశాలల బంద్ విజయవంతం





ఎదులాబాద్‌లోని మేగా మహిళా కళాశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త: ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి నీరజ్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, పీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, పిజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, బిఈడి, వృతివిద్యా కళాశాలల బంద్ నిర్వహించింది. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి నీరజ్‌తో పాటు నాయకులు ఉదయమే కళాశాలలకు చేరుకొని తరగతులను బహిష్కరించి బంద్ చేయించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ మహిళా, సంస్కృతి, ఎన్‌ఎఫ్‌సీనగర్ మదర్‌థెరిస్సా ఫార్మసీ, అవుషాపూర్‌లోని విజ్ఞానభారతి, ఎదులాబాద్‌లోని మేగా మహిళా, ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలను నాయకులు నినాదాలు చేస్తూ మూసివేయించారు. కళాశాల సమయానికి వివిధ ప్రయాణ సాధనాల ద్వారా వచ్చిన విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ బంద్‌తో తిరిగి వెనుదిరిగారు. అనుకోకుండా వచ్చిన సెలవుతో విద్యార్థులు సినిమా థియేటర్లు, రెస్టారెంట్లు, షాపింగ్, ఇతర వినోద కార్యక్రమాలకు వెళ్లారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భాను, గోపి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన బంద్‌తో కళాశాలలు దాదాపు మూసి వేశారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇకనైనా విద్యార్థుల సమస్యల దృష్ట్యా స్కాలర్‌షిన్, పీజులరియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## వాకర్స్ కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలి

### : ఎమ్మెల్యే టి.రాజాసింగ్ డిమాండ్

**గోషామహల్,అక్టోబర్ 30ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో తాతలు,ముత్తాతల కాలం నుండి గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్ చేయడం జరుగుతుందని,అందుకు గోషామహల్‌పరిసర ప్రాంతాల ప్రజలకు పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,డిజిపిలకు గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు గోషామహల్ వెల్పేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డి.గోపాల్‌జీ,రాజ్‌కుమార్,టి.సంజయ్,నరేష్‌సింగ్, కన్నయ్యలాల్ యాదవ్‌లు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి,బండి సంజయ్,ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌లను కలిసి గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో స్థానిక ప్రజలకు వాకింగ్ కోసం చిన్నపిల్లల పార్క్,వాకింగ్ ట్రాక్,జీమ్ వాకింగ్ చేయడం కోసం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు తెలిపారు.33 ఏకరాల ప్రభుత్వ స్థలంలో 21 ఏకరాలు ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కొరకు ఇచ్చినట్లు తెలిపారు.మిగతా 11 ఏకరాల స్థలాన్ని పోలీస్ విభాగం ఆధీనంలో ఉంది.గతంలో గోషామహల్ నియోజకవర్గం ప్రజలే కాకుండా పాతబస్తీ నుంచి కూడా ఉదయం,సాయంత్రం వేళ్ల పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్,వ్యాయం చేసే వారని,అంతేకాకుండా వాలీబాల్,షటిల్,టెన్నిస్ ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొవడం జరిగేందన్నారు.పోలీసు గ్రౌండ్‌ను ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం కోసం ఇవ్వడం ద్వారా వాకింగ్ వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు.అదే విధంగా పోలీసులకు కేటాయించిన స్థలంలో చిన్నపిల్లల పార్క్,వాకింగ్ ట్రాక్,వాలీబాల్,కబడ్డీ,టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కళలపట్ల మక్కువ ఉండటం అభినందనీయం

### అసెంబ్లీ కార్యదర్శి నరసింహచారి

**అప్జల్‌గంజ్,అక్టోబర్ 30ప్రభాతవార్త:** వృత్తి దేవాదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్,ప్రవృత్తిగా చిత్రలేఖనంగా మార్చుకున్నాడు .చిత్రకారుడిగా కాండూరి కృష్ణమాచారి తన నైపుణ్యం ద్వారా ఎన్నోఅద్భుతమైన చిత్రాలను గీస్తూ చిత్రకారుడిగా రాణిస్తున్నాడు.అయితే అసెంబ్లీ కార్యదర్శి నరసింహ చారికి ఇష్టదైవమైన నరసింహా స్వామి చిత్రపటాన్ని కృష్ణమాచారి స్వయంగా చిత్రీకరించారు.ఈచిత్రపటాని దేవాదాయశాఖ జె.ఎ.సి అద్యక్షులు కాండూరి కృష్ణమాచారి,ప్రముఖ సింగర్ కృష్ణచైతన్య,వసంతకుమారి కలిసి వెల్లి అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారికి యాదగిరి లక్ష్మినరసింహా చిత్రపటాన్ని బహుకరించారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ వృత్తితోపాటు కాండూరి కృష్ణమాచారి చిత్రలేఖనంపై రాణించడం పట్ల అభినందనీయమన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బాలనగర్ డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 30, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ కొడుకు రోహన్ దేవ్ ( 21) హైటెక్ సిటీలోనీ మాదాపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే గురువారం ఉదయం బోయిన్‌పల్లిలోని ఇంటి నుండి బయలుదేరి విధులకు వెళుతుండగా మార్గమధ్యంలో బాలనగర్ ప్లైఓవర్ పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో రోహన్ దేవ్ తలకు బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. ఈ మేరకు బాలనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నష్టపరిహారం చెల్లించాలనే సుప్రీం కోర్టు ఆలోచన అభినందనీయం

### తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** ఒక నిర్దోషి శిక్షకు గురైతే, అతనికి నష్టపరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు ఆలోచన చేయటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశంలోని పౌరులకు నష్టం, కష్టం, అగౌరవాలు కల్గినప్పుడు నష్టపరిహారాలు పొందేందుకు రాజ్యాంగం కల్పించిన వ్యవస్థలు ఉన్నాయికానీ, తప్పు చేయకుండా, తప్పుడు అభియోగాలతో శిక్షపడి, జైలు పాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే వ్యవస్థ ఇప్పటి వరకు లేదని, అలాంటి వ్యక్తులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలించటం శుభపరిణామమని అన్నారు. ఒక పౌరుడిని వ్యవస్థ బలిపశువును చేసి, తప్పుడు సాక్ష్యాలతో శిక్ష పడేవిధంగా చేస్తే, ఆ వ్యక్తి నిర్దోషిగా బయటకు వచ్చినప్పటికీ, జైలులో అతను కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణలోకి తీసుకుని, తగు మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు యోచిస్తోందని తెలిపారు. సుప్రీం బెంచ్ కోరినప్పుడు ప్రభుత్వం స్పందించి, ఒక వ్యవస్థను ఏర్పాటుచేయవలసిన అనివార్యత ఉన్నదని, ఆదిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయిన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కెటిఆర్ రోడ్ షోని విజయవంతం చేద్దాం

## ఎమ్మెల్సి నాగరకుంట నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్ టౌన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భారీ మెజారిటీ సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ,సోమాజిగూడలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి రోడ్ షో ని విజయవంతం చేసి మాగంటి సున్నితమ్మ గెలుపుకు కృషి చేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా సోమాజిగూడలో కేటీఆర్ గారి రోడ్ షో ఏర్పాటుకు అవసరమైన స్థలాని మరియు రూట్ మ్యాప్ ని పరిశీలించారు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి,స్థానిక మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్,అడ్వకేట్ దీప్తి,స్థానిక నాయకులు అప్పు ఖాన్,డివిజన్ నాయకులు బూత్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం రోజువారి ప్రచార కార్యక్రమాలపై మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి గారి నివాసంలో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు పలు అంశాలపై చర్చించారు.


మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి


పూడూరు మండలం మేడిపల్లి కలాన్‌లో రోగులకు మందులకు అందజేస్తున్న వైద్యులు

## ఉచిత వైద్యసేవలు అందించండం అభినందనీయం

### బిఆర్ఎస్ పార్టీ నాయకుడు రవి

**పూడూరు, అక్టోబరు 30, ప్రభాత వార్త:** మెడిక్యూర్ ఆసుపత్రివారు పేద ప్రజలకు ఉచితవైద్యసేవలు అందించండం అభినందనీయమని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుడు రవి అన్నారు. మెడిక్యూర్ ఆసుపత్రి వికారాబాద్ అధ్వర్యంలో గురువారం పూడూరు మండలం పరిధిలోని మేడిపల్లి కలాన్‌లో ఉచిత వెద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 280మంది వివిధ సమస్యలతో బాధపడుతున్న రోగులు వెద్యశిబిరానికి హాజరుకాగా, ఆసుపత్రి సిబ్బంది వివిధ రకాల ఉచిత పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లలిత,డాక్టర్ అభినవ్‌గుప్తా,డాక్టర్ రాజేందర్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉమాకు శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు

## లక్ష్యాన్ని సాధించిన ఉమాకు అభినందనలు తెలిపిన బిజెపి నాయకులు

### కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్ 2కు ఎంపిక

**కేశంపేట ,అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఉమా గ్రూప్ 2కి ఎంపికైన సందర్భంగా ఆమెకు కేశంపేట మండలానికి చెందిన బిజెపి నాయకులు గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించబోతున్న ఉమాకు అభినందనలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ యువ నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఒకవైపు గత కొంతకాలంగా కేశంపేట పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరోవైపు ఫ్యామిలీని చూసుకుంటూ. లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో గ్రూప్ 2కి ఎంపికై సెక్రెటరీయేట్ లో బాధ్యతలు నిర్వహించబోతున్న కానిస్టేబుల్ ఉమా మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, పిప్పళ్ళ నరేందర్, మండల బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు పరామర్శల వెల్లువ

**షాద్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** ఇటీవల మాజీ మంత్రీ బిఆర్ఎస్ అగ్ర నాయకులు హరీష్ రావుకు ఇటీవల పితృవియోగం సంభవించిన విషయం తెలిసిందే ఈ సందర్భంగా హైదరాబాదులో హరీష్ రావు నివాసంలో స్వర్గీయ తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం హరీష్ రావును కుటుంబ సభ్యుల్ని పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజ వరప్రసాద్ మరియు టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేశ్వర్ అందె తదితరులు మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శుభప్రద్ పటేల్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, సుమిత్ర ఆనంద్, రంగినేని అభిలాష్ తదితరులు ఉన్నారు.


సత్యనారాయణ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

## తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్‌గా బర్క కృష్ణ

**షాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గా బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణను నియమిస్తూ గురువారం తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో టీఎస్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా నియమించినందుకు ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుండి బడుగు బలహీనవర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి హక్కులను సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, తదితరులు ఉన్నారు.

# నిండుకుండలా సహదేవి సముద్రం చెరువు

45 ఏళ్ల తరువాత అలుగు పారిన వైనం
పరవశంలో స్థానికులు
చెరువు వద్ద ఎమ్మెల్యే నారాయణరెడ్డి పూజలు
రైతులరు మేలుచేకూరుతుందని హర్షం


పూజలో పాల్గొన్న ఏం ఎల్ కసిరెడ్డి నారాయణరెడ్డి

**రంగారెడ్డి, అక్టోబరు 30,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రసిద్ధి చెందిన సహదేవి సముద్రం చెరువు 45 ఏళ్ల తరువాత అలుగు పారడంతో గురువారం స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి . చెరువులో ప్రత్యేకంగా పూజలు చేసి, సహదేవమ్మ మాతకు చీర, సారే , గాజులు,సమర్పించి, తదనంతరం అలుగు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్జాల్, చౌదర్ పల్లి, మాదాయిపల్లి, ఇస్రాయిపల్లి, చెన్నంపల్లి, వెంకటాపూర్, అంతారం, జూలపల్లి, మెదక్ పల్లి, గట్టు ఇప్పలపల్లి, తదితర గ్రామాలనుంచి తరలివచ్చిన ప్రజలతో కలిసి పూజ నిర్వహించారు. వందలాది మంది ప్రజలు, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ జిల్లాల ప్రజలు 45 ఏళ్లుగా చెరువు అలుగు పారడం కోసం ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరిందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ఏ శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యటా నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, గ్రామ మాజీ ఎం పి టి సి లు జి. శ్రీనివాసమూర్తి, ఏం. అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్,మాజీ ఉప సర్పంచ్ లు బి నర్సింలు, మాజీ సర్పంచులు, వీ జైపాల్ రెడ్డి, పి.రమేష్ యాదవ్,ఎం ఎ.అజీజ్ , పి అశోక్ బాబు, ఏ .వెంకట్ రెడ్డి టి కృష్ణయ్య గౌడ్, సి.లింగం యాదవ్ ఎండి యూసుఫ్,వద్దే రాజు,చింతకాయల లక్ష్మణ్, పులిజల విష్ణు , టి భూపాల్ రెడ్డి, ఏం యాదయ్య, ఏ శ్రీనివాస్ గౌడ్, టి భాస్కర్,సి రవి, టీ ప్రదీప్ రెడ్డి, బి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ శేఖర్, డి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో..

తలకొండపల్లి మండల పరిధిలోని వెళాళగ్రామములోని చెరువు నిండి అలుగు పారడంతో గురువారం ఉదయం బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి కొబ్బరికాయలు కొట్టి మొక్కలతో పూజలు నిర్వహించారు .ఈసందర్భంగా మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ చెరువు నిదడం రైతులకు ఎంతో మేలు జరుగు తుందని అన్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాస్ యాదవ్,జిల్లాకోసభ్యులు ముజఫర్ రెహమాన్, నరేంద్రగౌడ్, విజయ్‌కుమార్,విష్ణువర్ధన్,దర్వుల శంకర్ ,భాస్కరరెడ్డి ,శ్రీకాంత్,శ్రీరాములు,శేఖర్ మొగల్,పండు తదితరులు

# పౌల్ట్రీ రైతుల పన్ను రద్దును బిఆర్ఎస్ పట్టించుకోలేదు

**షాద్‌నగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పౌల్ట్రీ రైతుల పన్ను రద్దు వ్యవహారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టు వదలని విక్రమార్కుడిలా కృషిచేశారని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చటాన్ పల్లి పౌల్ట్రీ రైతుల సమస్యపై ఏలాంటి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేసిందని మండిపడ్డారు. పౌల్ట్రీ రైతుల ఆస్తి పన్ను బకాయిల రద్దు వ్యవహారంలో తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పాతూరి వెంకటరావు, అరికెపూడి గాంధీ తదితర నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏదో విషయంలో కలుసుకొని మరేదో ప్రచారం చేసుకొని వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఆరోపంచారు. షాద్ నగర్ మాజీ కౌన్సిలర్ చేగూరీ రాజేందర్ రెడ్డి తదితర పౌల్ట్రీ నాయకులు కాప రామారావు, మాకినేని వెంకటనారాయణ, మదమంచి అనంధరావు, నువ్వుల శ్రీనివాసరావు, బిసి సెల్ నాయకులు గడ్డమీది రమేష్ తదితరులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో పలు సందర్భాల్లో ఎమ్మెల్యే శంకర్ రూ. 5.5 కోట్లకు పైగా ఆస్తి పన్ను రద్దు గురించి ముఖ్యమంత్రిని పలుమార్లు కలిసి చర్చించారని తెలిపారు. గత 10 సంవత్సరాలలో పాత ప్రభుత్వం ఆస్తి పన్ను రద్దుకు సహకరించకపోగా ఇక్కడి రైతాంగం ఎంత మొరపెట్టుకున్నా వారి విజ్ఞాపనలను బుట్ట దాఖలు చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గత ఎన్నికల ప్రచారంలో పౌల్ట్రీ ప్రజలకు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చి గెలిచాక ఆ సమస్యను సాధించే దిశగా ముందడుగు వేశారని గుర్తు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ చేకూరి రాజేందర్ రెడ్డి

## మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యం

### కమీషనర్ వెంకట్‌రెడ్డి



డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో సమస్యలను తీర్చాలని కమీషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న బిజెపి అధ్యక్షులు కోల బాలరాజు

**కీసర, అక్టోబరు30,ప్రభాతవార్తః** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలలో మౌళిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమని కమీషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామంలో డబుల్ బెడ్‌రూం కాలనీలలో సమస్యలు విలయతాండవం ఆడుతున్నాయని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ కమీషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీల ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని అన్నారు.కాలనీలో కేవలం ఇండ్లు మాత్రమే ఉన్నాయని కనీస మౌళిక వసతులు లేవని,ఇండ్ల పట్టాలు వచ్చాయి కానీ డ్రైనేజీ,త్రాగునీరు,రోడ్లు,కరెంటు సమస్య,ఇంటి నంబర్లు లేవని చీకట్లో ఏక్కడ ఏముందో తెలియక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్లల్లో సమస్యలను తీర్చడానికి సిద్దంగా ఉన్నామని,కనీస మౌళిక వసతులు కల్పనకు కృషి చేస్తామని అన్నారు.డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో ఇంటి నంబర్లు 3 వారాల్లో ఇస్తామని తెలిపారు.సమస్యలను తీరుస్తానని కమీషనర్ హామీ ఇవ్వడంతో కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బోడ శ్రీనివాస్,రమేష్ గౌడ్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 1న ఛలో హైదరాబాద్

**షాద్‌నగర్ టౌన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి మీద చేసిన దాడిని దళితులు ఉన్నత స్థానంలో కూర్చోవడాన్ని జీర్ణించుకోలేని శక్తులు మా ఆత్మగౌరవం మీద చేసిన దాడిగా భావిస్తున్నామని, దాడి జరిగి 20 రోజులు గడుస్తున్న దాడి చేసిన వ్యక్తిపై కేసు, అరెస్టులు చేయడం లేదని, ఎన్నో కేసులను సుమోటో గా స్వీకరిస్తున్న పోలీసు వ్యవస్థకు , న్యాయవ్యవస్థకు చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి కనిపించడం లేదా..? విశ్వాసాలు ధర్మాల పేరుతో దాడులు చేస్తే వారికి చట్టం వర్తించదా..? అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ ప్రశ్నించారు. షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ అధ్యక్షతన జరుగగా, ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ " జస్టిస్ గవాయి దాడి చేయడమంటేనే యావత్ న్యాయ వ్యవస్థ మీద రాజ్యాంగ స్ఫూర్తి మీద దాడి చేయడమేనని ఈ దాడిని దేశం మొత్తం అనాగరికమైన దాడి అని, ప్రధానమంత్రి తో పాటు దేశప్రతిపక్ష నేతలు, అన్ని పార్టీలు దాడిని ఖండించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేయకపోవడం, కేసులు పెట్టాలని కోరకపోవడం చూస్తేనే వారి ద్వంద్వ విధానాలు ఏమిటో ..? దళితుల పట్ల వారి వైఖరి ఏ విధంగా ఉంటుందో..? వివక్ష ఎలా చూపిస్తారో కనబడుతుందని గుర్తుచేశారు. దాడి చేసిన లాయర్ రాకేష్ కిషోర్ ను తక్షణమే అరెస్టు చేసి కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. కోర్టులోనే దాడి జరిగింది దాడి ఘటనను సుమోటోగా స్వీకరించి ఢిల్లీ పోలీసులు క్రిమినల్ కేసులు పెట్టి దాడి చేసిన వ్యక్తితో పాటు ఆ దాడి వెనుక ఉన్న శక్తులను కూడా గుర్తించి కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1న లక్షలాది మందితో దేశమే మనవైపు చూసేలా దాడులకు దౌర్జన్యాలకు చరమగీతం పాడేలా, ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని చాటేలా ఛలో హైదరాబాద్ "దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీనిఖిఖి నిర్వహించబోతున్నామని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియం బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహం నుండి సెక్రటేరియట్ పక్కన గల పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే ఈ ఆత్మగౌరవ ర్యాలికి అన్ని గ్రామాల నుంచి ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే దళిత ప్రజలు అలాగే న్యాయ వ్యవస్థ మీద గౌరవాన్ని నిలబెట్టడం కోసం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడం కోసం కులాలు, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అన్నివర్గాలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో షాద్ నగర్ నాయకులు జోగు నాగభూషణం మాదిగ, గూడెం జంగయ్య మాదిగ, బొబ్బిలి పాండు మాదిగ, ఎం.ఎస్.ఎఫ్ జిల్లా నాయకులు ఎర్రోళ్ల సురేష్ మాదిగ, కళ్ళపెల్లి బాలరాజు మాదిగ, సంగెం శ్రీనివాస్ మాదిగ, పానుగంటి శ్రీను, మురళి, అరవింద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తాం

## బిసి రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు

**షాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** బిసిలకు 42శాతం రిజ ర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని బిసి రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు అన్నారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌర స్తాలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. గురువారం మండలంలోని వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు రిలే దీక్షలో కూర్చు న్నారు. వీరికి చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీమ్ భారత్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనాభాలో అధికంగా ఉన్న బిసికు అణచివేతకు గురవుతున్నారని చెప్పారు. 42శాతం రిజర్వే షన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతి నిధ్యం వహించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. షాబాద్ మండలం ఉద్యమాల గడ్డ అని, ఇక్కడి నుంచి ప్రారంభించిన పోరాటం ఏది విఫలం కాలేదని అన్నారు. బిసిలు తమ హక్కుల సాధన కోసం చేస్తున్న న్యాయపోరాటం గెలుపు ముంగిట్లో ఉందని అన్నారు. బిసిలంతా పార్టీలకతీతంగా రిలే దీక్షలో పాల్గొని, ఏకతాటిపైకి వచ్చి హక్కుల సాధనకోసం ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు జడల రాజేం దర్ గౌడ్, నక్క శ్రీనివాస్ గౌడ్, కల్వకోల్ వెంకట్ యాదవ్, తమ్మలి రవీందర్, పోసమోని రమేష్ యాదవ్, రాపోలు నర్సింహులు, బైరంపల్లి నవీన్, యాదగిరి, రాజేష్, ఎగురీ మల్లికార్జున్, కొండ ప్రదీప్, పర్వవేధి, శ్రీకరప్ప, వీరేష్, సుధీర్, యాదగిరి, సాయి తేజ, తదితరులు ఉన్నారు.




రిలే నిరాహార దీక్షలో భీమ్ భారత్, బీసీ రిజర్వేషన్ రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న కొండా విజయ్

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎంఈఓ మనోహర్‌కు వినతి

**షాద్‌నగర్ టౌన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఈరోజు ఫరూక్ నగర్ మండల ఎంఈఓ మనోహర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కన్వీనర్స్ శ్రీను నాయక్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా గుడ్ల ధరలను కట్టెల బిళ్ళను గ్యాస్ బిల్లులను పెంచాలని మరియు పెండింగ్ లో ఉన్న గత విద్యా సంవత్సరానికి మరియు ప్రస్తుతానికి మనిషిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు అన్నారు అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 18000 ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వారు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు చిట్టెమ్మ సుమలత కాజా బేగం యాదమ్మ రెహానా లలితమ్మ హసీనా సౌలీబి శివమ్మ అనిత తదితరులు పాల్గొన్నారు.


మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం

.. ఇందిరమ్మ ఇళ్లును ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్
..తుర్కపల్లికి 53ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
..పాల్గొన్న అధికారులు, నాయకులు

**శామీర్‌పేట, అక్టోబరు 30, ప్రభాతవార్త**
తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావటంతో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ విచ్చేసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్దిదారులను గృహప్రవేశం చేయించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయటం, దాన్ని సకాలంలోనే నిర్మించుకోవటం లబ్దిదారులు గుర్కల బాబు దంపతులు గృహప్రవేశం చేయటం వారి అదృష్టంగా భావిస్తున్నట్లు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తుర్కపల్లి గ్రామానికి 53ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయినట్లు, 26ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు, మరో నాలుగు ఇళ్ల నిర్మాణంకు ముహూర్తం జరిగినట్లు, ఒకరి ఇళ్ల పూర్తి అయినట్లు, మరో 20ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని జి.వేణుగోపాల్‌రెడ్డి వివరించారు. దీనిలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, అధికారులు విజయ్‌కుమార్, హౌజింగ్ డిఇ అశోక్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊరడి వెంకటేశలతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.వెంకటేశ, మాజీ సర్పంచు కంఠం కృష్ణారెడ్డి, నాయకులు భూమిరెడ్డి, నవీన్‌రెడ్డి, కె.వినోద్, బి.సతీష్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్,పాల్గొన్న ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్, చైర్మన్, అధికారులు, నాయకుల దృశ్యం